# తొలి పలుకులు

ఆధునీకత అనే పిచ్చి ఆరాటంతో పూర్వ సంస్కృతిని మనం పూర్తిగా మరిచిపోతున్నాం.

ఆ ఆరాటానికి దురాశ, స్వార్థపరత్వం కూడా తోడయ్యాయి.

ఈ తీరు మారాలంటే...

అవసరాలకు అనుగుణంగా మన చర్యలుండాలనే విషయాన్ని పూర్వీకుల నుండి మనం నేర్చుకోవాలి.

మన సంక్షేమ సంతోషాల కోసం... ఈ పృథివిపై నివశించ బోయే వారి బాగోగుల కోసం... పూర్వీకుల నుండి మనకు లభించిన అనుభవజ్ఞానాన్ని మనం ప్రామాణికంగా నిలబెట్టు కోవాలి.

వారసత్వంగా సంక్రమించిన విలువైన ప్రాచీన సంస్కృతిని మనం రేపటి పౌరులకు భద్రంగా అందించ గలగాలి.

# విషయ సూచిక


1. అధ్యాయం 1 - ఒక నిశ్శబ్ద రాత్రి. . . . . . . . . . . . . . . . . . . . . . .2
2. అధ్యాయం 2 - కిటికీకి ఆవల. . . . . . . . . . . . . . . . . . . . . . . . .8
3. అధ్యాయం 3 - తోటలో సైకిలు మీద విహారం . . . . . . . . . . . . . . . 14
4. అధ్యాయం 4 - సాహసం మొదలైంది . . . . . . . . . . . . . . . . . . . .20
5. అధ్యాయం 5 - ఒక వింత ప్రపంచం . . . . . . . . . . . . . . . . . . . .26
6. అధ్యాయం 6 - నూతన ప్రయత్నం . . . . . . . . . . . . . . . . . . . . .32
7. అధ్యాయం 7 - జీవన విధానం. . . . . . . . . . . . . . . . . . . . . . . .40
8. అధ్యాయం 8 - అతిథి సత్కారం . . . . . . . . . . . . . . . . . . . . . .52
9. అధ్యాయం 9 - నిజమైన శక్తి . . . . . . . . . . . . . . . . . . . . . . .56
10. అధ్యాయం 10 - పరివర్తన మొదలైంది . . . . . . . . . . . . . . . . . . .60

తుది పలుకులు . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .66

# ఒక నిశ్శబ్ద రాత్రి





నిద్ర పోయే సమయం ఆసన్న మయింది. సహం తన చేతిలో ఉన్న పుస్తకం లోని ఆఖరి పేజీ చదువుతున్నాడు.

ఆ పుస్తకం పేరు 'ప్రపంచ విపత్తులు'. సహంకు పదకొండవ పుట్టిన రోజు కానుక గా వాళ్ళ అమ్మమ్మ ఇచ్చింది.

"సహం! ఇంకా పడుకో లేదా?" సహంకు వాళ్ళమ్మ గొంతు వినపడింది.

"అవునమ్మా! చివరి పేజీ కొచ్చేశాను. పడుకుంటాన్లే." అతని ధ్యాసంతా అతను చదువుతున్న పుస్తకం మీదే ఉంది. కొన్ని నెలల క్రితం కరోనా మహమ్మారి ఎంత ప్రళయం సృష్టించిందో ఇంకా అతను మరిచిపోలేదు. అంతకు ముందు అంతటి ప్రమాదకరమైన విపత్తులేమైనా సంభవించాయా? అనే ప్రశ్నకు సమాధానం కోసం ఆపుస్తకంలో వెతుకుతున్నాడు. అయినా అటువంటి సంఘటనలు జరిగినట్లు అతని అవగాహనకు రాలేదు. పడుకోబోయే ముందు సహం పళ్ళు తోముకోవడం మొదలెట్టాడు. అంతలో వాళ్ళ అమ్మమ్మ మెల్లగా అతని గది లోనికి వచ్చి అతని మంచం పై కూర్చుంది.

"సహం బాబూ! నిన్ను నిద్రపుచ్చుతాను, రా నాన్నా!" వాళ్ళ అమ్మమ్మ పిలిచింది.

"అమ్మమ్మ నన్ను ఇంకా బుజ్జి పాపాయిననుకుంటుంది." సహంకు నవ్వొచ్చింది. అమ్మమ్మంటే తనకు ఎంతో ఇష్టం. నీటితో నోరు పుక్కిళించుకుని తన గదిలోనికి వచ్చి తన మంచంపై పడుకున్నాడు.

కరోనా మహమ్మారి ప్రబలిన రోజుల్లో వాళ్ళ అమ్మమ్మ... సహం వాళ్ళ ఇంటికొచ్చింది. అతను నిద్ర పోయే వేళ వాళ్ళ అమ్మమ్మ అతని గదికి వచ్చి, మంచి కథలు చెప్పి అతనిని నిద్రపుచ్చుతుంది.

"అమ్మమ్మా!" సహం, వాళ్ళ అమ్మమ్మ ముడతలుబడ్డ నవ్వు ముఖంకేసి చూసి అన్నాడు.

"చెప్పు సహం బాబూ! ఏవిటి?" తన మృదువైన జుట్టును సరిచేసుకుంటూ అడిగింది.

''ఇంతకు ముందు నువ్వెప్పుడైనా కరోనా లాంటి మహమ్మారి ప్రబలటం చూశావా?"

ఓక్షణం ఆలోచించి వాళ్ళ అమ్మమ్మ ఇలా అంది.

"ఇంతటి మహమ్మారిని ఇంతకు మునుపెన్నడూ నేను చూడలేదు. కానీ నేను కొన్ని భయంకరమైన సంఘటనలు చూశాను."

"ఆమ్మో నిజంగానా అమ్మమ్మా? నీకేం కాలేదు కదా?"

"చూడు సహం బాబూ! ప్రపంచం ఇటువంటి ప్రమాదాలనెన్నింటినో తట్టుకుని నిలబడింది. తాత్కాలికంగా కష్టమనిపించినా ఒక్కొక్కప్పుడు ప్రమాదాల అనంతరం, గతం కంటే శోభాయమానంగా పరివర్తన చెందింది. ఉదాహరణగా కరోనా మహమ్మారినే తీసుకో. ఆ సమయం లో ప్రకృతి మాత మనల్నందరినీ ఇళ్లకే పరిమితం చేసి తనను తాను పర్యావరణ కాలుష్యం నుండి కాపాడుకుంది. మనం పీల్చే గాలి ఇప్పుడు ఎంత స్వచ్ఛంగా ఉందో గమనించావా? చెట్లు, చేమలు ఇంతకు ముందుకంటే ఎక్కువ పచ్చదనంతో ఎంత కళకళ లాడుతూ కనిపిస్తున్నాయి చూసేవా?" వాళ్ళ అమ్మమ్మ తన అనుభవం తో చెప్పిన మాటలివి.

వాళ్ళ అమ్మమ్మ చెప్పిన నిజాలు సహంను ఆశ్చర్యానికి గురి చేశాయి. కరోనా వల్ల మంచి కూడా జరుగుతుందని తానెప్పుడూ ఊహించలేదు. అవును అతని తోటలోని గాలి ఇంతకు ముందు కంటే స్వచ్ఛంగా వుంది. అతని వీధిలో ఇరువైపులా బారులు తీరిన చెట్లు కూడా పచ్చపచ్చగా కోమలంగా కనిపిస్తున్నాయి. ఒక రోజు ఉదయం అతడు నిద్ర లేచాక ఎప్పుడూ వినని ఒక పిట్ట కూత విని, పరుగున అటువైపు గా వెళ్లి పరికించి చూడగా ఒక కొత్త పిట్ట కనిపించింది. ఆ పక్షిని క్రితంలో తానెప్పుడూ చూడలేదు. ప్రకృతిమాత తన రహస్యాలన్నిటినీ బహిర్గతం చేస్తుందనడానికి ఇవి నిదర్శనాలు. ఎందుకంటే మానవులు తమ ఇళ్లకే పరిమితమై తన సంక్షేమానికి విఘాతం కలిగించటం లేదుగా.

“అమ్మమ్మా! మానవులే ఎందుకు ఇళ్లకు పరిమితం చేయబడ్డారు?” సహం ప్రశ్నించాడు.



“నేను శాస్త్రవేత్తను కాను. కానీ, అప్పుడప్పుడూ భూమాత మనకు కొన్ని పాఠాలు నేర్పుతూ ఉంటుందని నేను నమ్ముతాను. మానవులు అనేక విధాలుగా ప్రకృతిని బలహీన పరచడానికి అలవాటు పడ్డారు. అలా చెయ్యొద్దని, చేస్తే మీకే నష్టమని మనల్ని భూమాత హెచ్చరిస్తున్నట్లు నాకనిపిస్తోంది.” అని చెప్పి వాళ్ళ అమ్మమ్మ ఊరుకుంది. సహంకు ఆమె చెప్పింది అర్థవంతంగా ఉందనిపించింది.

వాళ్ళ అమ్మమ్మ మాటల్లో నిజం లేకపోలేదు. ఎంతటి దుష్ప్రభావం సంభవించినప్పటికీ, మంచి కూడా తోడవుతుంది. సహంకు నిద్ర ముంచుకు వస్తోంది.

“శుభ రాత్రి అమ్మమ్మా! నాకు నిద్రొస్తోంది.” అన్నాడు.

“శుభ రాత్రి సహం బాబూ!” సహంను నిద్రపుచ్చాననన్న సంతోషంతో వెళ్ళిపోయింది. సహం నిద్రలోకి జారుకున్నాడు.

నీలాకాశం, పక్షుల కిలకిలారావాలు అతని కలల్లో చోటుచేసుకున్నాయి.